# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 360
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
నవంబర్ 24, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# మేం కట్టం.. వేరే వాళ్లను కట్టనివ్వం!

- దిక్కున్న చోట చెప్పుకో..
- తాపీ మేస్త్రీ సంఘం జులుం
- ఇంటి యజమానికి బెదిరింపులు
- వరంగల్ రామన్నపేటలో ఘటన
- మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

8లో..



## ఏకవీరా ఆలయాన్ని టూరిజం హబ్‌గా మారుస్తాం

□ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి హామీ

మండలంలోని మొగిలిచెర్లలోని చారిత్రక నేపథ్యం కలిగిన కాకతీయుల కాలం నాటి శ్రీ ఏకవీరా దేవి ఎల్లమ్మ దేవాలయాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఈ చారిత్రక దేవాలయాన్ని ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు పలువురు ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్శనలో కుడా చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి, గీసుకొండ మండల్ తాసిల్దార్ రియాజుద్దీన్, పురావస్తు శాఖ సీనియర్ అసిస్టెంట్ రాములు నాయక్, టార్చి సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య పాల్గొన్నారు. **–వరంగల్ వాయిస్, గీసుకొండ**



8లో..

## పెండింగ్ పనులు పూర్తి చేయండి

- కార్పొరేటర్ మరుపల్ల రవి
- బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా



2లో..

## ప్రభుత్వం ఆదుకోవాలి

తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ

మురళీకృష్ణ స్వామిని పరామర్శించిన అర్చక నేతలు



# డాక్టర్లా.. బ్రోకర్లా..!

**ఆర్ఎంపీ, పీఎంపీల ముసుగులో దందా**

- అర్హత లేకున్నా డాక్టర్ పేరుతో చెలామణి
- నగరంలోని ప్రముఖ ఆస్పత్రులతో లింకులు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- అమాయకులైన పింఛన్ దారులే వీరి టార్గెట్
- అధికారుల జోక్యం అంతంతమాత్రమే

నగర శివారు ప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లో నకిలీ వైద్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. సరైన అర్హత, అనుమతులు లేకున్నా, కొందరు తమను తాము 'డాక్టర్లు'గా పరిచయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. వీరి ప్రధాన లక్ష్యం వైద్యం కంటే... డబ్బు సంపాదనే ముఖ్యం అన్న చందంగా మారింది. 'డాక్టర్' పేరుతో క్లినిక్‌లు నడుపుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలు బ్రోకర్ల అవతారం ఎత్తి అందిన కాడికి దండుకుంటున్నారు. చాలా మంది నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రచార ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. పర్సంటేజీలు తీసుకొని రోగులను వారికి అప్పగిస్తున్నారు. ముఖ్యంగా పేదలు, అమాయకులైన పింఛన్ దారుల ఆరోగ్య సమస్యలు ఇక తీరేవి కావన్నట్లు కలరింగ్ ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. రోగికి అవసరం లేకపోయినా, వివిధ రకాల స్కానింగ్‌లు, ఖరీదైన ఇతర వైద్య పరీక్షలను చేయిస్తున్నారు. మూడు నెలల క్రితం హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేస్తున్నట్లు ప్రకటించిన జిల్లా వైద్యాధికారి ఆర్ఎంపీ, పీఎంపీలనుంచి పెద్ద మొత్తంలో నొక్కినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే కాకుండా వారినుంచి ప్రతినెల మామూళ్ల రూపంలో అప్పనంగా వస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే పై అధికారులెవ్వరూ నోరుపెదమడం లేదన్న ఆరోపణలున్నాయి.

**- వరంగల్ వాయిస్, దామెర**

వివరాలు 2లో..

2
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, నవంబర్ 24, 2025

# డాక్టర్లా.. బ్రోకర్లా..!



- ఆర్ఎంపీ, పీఎంపీల ముసుగులో దందా
- అర్హత లేకున్నా డాక్టర్ పేరుతో చెలామణి
- నగరంలోని ప్రముఖ ఆస్పత్రులతో లింకులు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- అమాయకులైన పింఛన్ దారులే వీరి టార్గెట్
- అధికారుల జోక్యం అంతంతమాత్రమే

**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ ప్రాథమిక వైద్యం అందించే ఆర్ఎంపీ, పీఎంపీలు తమ వృత్తి పరిధిని దాటి వ్యవహరిస్తున్నారు. వీరి పని కేవలం ప్రథమ చికిత్స అందించడమే అయినప్పటికీ, అనేక ప్రాంతాల్లో ఎంబీబీఎస్, ఎండీ, సర్జన్లను మించి వైద్యం చేస్తున్నారు. కీలకమైన చికిత్సలు, మందులు ఇస్తూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సరైన నిర్ధారణ లేకపోవడం, తప్పుడు మందులు ఇవ్వడం వంటి కారణాలతో గతంలో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయినా వీరి తీరులో మార్పు రావడం లేదు. ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ వృత్తి ధర్మాన్ని పాటించి, కేవలం అత్యవసర ప్రాథమిక చికిత్సకే పరిమితం కావాలి. సంక్లిష్టమైన కేసులు వచ్చినప్పుడు, రోగులను వెంటనే అర్హత కలిగిన వైద్యులకు లేదా పెద్ద ఆసుపత్రులకు సిఫార్సు చేయాల్సిన బాధ్యత ఉంది.

### కమీషన్ల దందా..

కొంతమంది అనైతిక వైద్యులు లేదా అర్హత లేని వైద్య వృత్తిదారులు (నకిలీ డాక్టర్లు) తమ వృత్తిని ప్రజలకు సేవ చేయడం కంటే, డబ్బు సంపాదనే ప్రధాన లక్ష్యంగా మార్చుకున్నారు. రోగులను కేవలం ఆదాయ వనరుగా మాత్రమే చూస్తూ, వారి అవసరాలను అడ్డం పెట్టుకుని ఆర్థికంగా దోచుకుంటున్నారు. రోగికి నిజంగా అవసరం లేకపోయినా, వీరు వివిధ రకాల స్కానింగ్‌లు, అత్యాధునిక రక్త పరీక్షలు, ఇతర ఖరీదైన డయాగ్నస్టిక్ టెస్టులను చేయిస్తున్నారు. రోగిని నిర్దిష్ట ల్యాబ్‌లు లేదా కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారు. ఈ పరీక్షలు చేయించినందుకు, రోగిని ఆసుపత్రికి పంపినందుకు గానూ ల్యాబ్‌లు, హాస్పిటల్స్ నుంచి కమీషన్ల రూపంలో పెద్దమొత్తంలో దండుకుంటున్నారు. ఈ కమీషన్లతో



రోగిపై అనవసరమైన ఆర్థిక భారం పడుతోంది. అంతేకాకుండా అనవసరమైన రేడియేషన్ లేదా చికిత్సలకు లోనయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ రకమైన అనైతిక పద్ధతులు వైద్య వృత్తి విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి.

### నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యంతో కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు చెలగాటం ఆడుతున్నారు. వీరు ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా క్లినిక్‌లు, మెడికల్ షాపులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కొందరు తమ మెడికల్ షాపుల్లోనే వైద్యం చేస్తూ, రోగ నిర్ధారణ చేయకుండానే మందులు ఇస్తున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రాథమిక చికిత్స అందించడానికి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, కొందరు తమ 'అనుభవం' పేరుతో రోగులకు తీవ్రమైన అనారోగ్యాలకు కూడా తప్పుడు మందులు ఇస్తున్నారు. సరైన వైద్య అర్హత, శిక్షణ లేకపోవడంతో వీరు ఇచ్చే మందులు తరచుగా వికటించి, రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను పెద్ద ఆసుపత్రులకు తరలించడంలో జాప్యం చేసి, వారి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నారు.

### అధికారుల స్పందన కరవు

నకిలీ వైద్యుల దందా, అక్రమ క్లినిక్‌ల నిర్వహణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. డాక్టర్ పేరుతో దందా చేస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీల క్లినిక్ లపై త్వరలోనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. సరైన అర్హతలు, అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై, కమీషన్ల కోసం అనవసర పరీక్షలు చేయిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ వృత్తిని మాని బ్రోకర్ల వృత్తితో జేబులు నింపుకుంటున్న వారిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రభుత్వం ఆదుకోవాలి

- తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ
- మురళీకృష్ణ స్వామిని పరామర్శించిన అర్చక నేతలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బస్సు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న అతి పురాతనమైన శ్రీ గోవిందరాజస్వామి దేవాలయ అర్చకులు వరయోగుల మురళీకృష్ణ స్వామిని ప్రభుత్వం ఆదుకోవలని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్ డిమాండ్ చేశారు. వారం రోజుల క్రితం జనగామ జిల్లా రఘునాథపల్లి సమీపంలోని నడిగొండ శివారులో జరిగిన బస్సు ప్రమాదంలో మురళీకృష్ణ స్వామి తీవ్రంగా గాయపడడంతో తన ఎడమ కాలును తీసివేయడం జరిగినది. దీంతో చికిత్స పొందుతున్న మురళీకృష్ణ స్వామిని సోమవారం గంగు ఉపేంద్ర శర్మ, తనుగుల రత్నాకర్, రాష్ట్ర పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వరయోగుల సురేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ వరయోగుల మురళీకృష్ణ స్వామి బస్సు ప్రమాదంలో కాలు కోల్పోవడం విచారకరమన్నారు. తెలంగాణ అర్చక వెల్ఫేర్ బోర్డు నుంచి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సహకారంతో ఆర్థిక సాయం అందే విధంగా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మురళీకృష్ణ స్వామికి ఆర్థిక చేయూతనందించేందుకు చర్యలు చేపడతానన్నారు. అదేవిధంగా మురళీకృష్ణ స్వామికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నందున అతని భార్యకు కాంట్రాక్ట్ బేసిక్ లో ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా మంత్రి కొండా సురేఖను కోరనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన మురళీకృష్ణ స్వామి విషయాన్ని మంత్రి సురేఖ దృష్టికి తీసుకుపోయి దేవాదాయ శాఖ నుంచి తగిన న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి మాట్లాడుతూ శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయంలో గత 30 సంవత్సరముల నుంచి ఎటువంటి జీతభత్యాలు లేకుండా స్వామివారి నిత్య కైకర్యములు నిర్వహించుచూ భక్తులు ఇచ్చే సంభావనలతో తన కుటుంబాన్ని పోషించుకుంటున్న మురళీకృష్ణను దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ గోవిందరాజస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు, తెలంగాణ అర్చక సమాఖ్య వరంగల్ అర్బన్ అధ్యక్షులు వరయోగుల శ్రీనివాస స్వామి, గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు వరయోగుల లక్ష్మణస్వామి, దాస్యం వాసు, తిరునగరి ప్రశాంత్, తాడూరి గోపి, జగన్నాథం, వెంకటేశ్వర్లు, దాస్యం రంగనాథ్ తోపాటు వికాస తరంగిణి సభ్యులు అడ్వకేట్ జేఏసీ నాయకులు వోడాపెల్లి శ్యామ్, కృష్ణ తదితరలు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మురళీకృష్ణకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పదంతో సహాయం అందించాలని ఓడపల్లి శ్యామ్ కృష్ణ విన్నవించారు.




# హామీల అమలును విస్మరించిన ప్రభుత్వం

- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ధర్నా
- కలెక్టర్ కార్యాలయంలో వినతి

**వరంగల్ వాయిస్, కలెక్టరేట్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తున్నదని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు చిర్ర సూరి ఆరోపించారు. సోమవారం వరంగల్ జిల్లా కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్టంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలుచేయాల'ని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, వరంగల్ జాయింట్ కలెక్టర్ సంధ్యారాణికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు తప్ప మిగతా హామీలను విస్మరించటం తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. రెండు సంవత్సరాల పాలన పూర్తయిందని సంబరాలకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు మాట ఏమిటని ప్రశ్నించారు. 420హామీలు, 6గ్యారంటీలు అమలు చేసిన తర్వాతనే సంబరాలు జరుపుకోవాలని గుర్తు చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో పత్తి, మొక్కజొన్న, వరి ధాన్యాలను ప్రభుత్వ రంగ సంస్థలచే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, గత సంవత్సరం యాసింగి వరి బోనస్ వెంటనే చెల్లించాలని, వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ. 6వేలు ఇస్తానన్న పెన్షన్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి మహిళకు రూ.2500 పెన్షన్ అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇండ్ల మంజూరు చేయాలని, పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ఆటో వ్యవసాయ కార్మికులకు ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తానన్న హామీని అమలు చేయాలని, నిరుద్యోగ భృతి పథకం కింద ప్రతి నిరుద్యోగి రూ.3వేలు చెల్లించాలన్నారు.

పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పందా) డివిజన్ నాయకులు మైదంపాణి, ధార లింగన్న, కత్తుల కొమురయ్య, సాబిరి కానీ మోహన్, సతీష్, గడి కొప్పుల రవి, సింగన బోయిన కట్టన్న, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహరావు, జిల్లా నాయకురాలు పి.అనూష, జన్ను రజిత, లింగారపు దేవేంద్ర, మైబమ్మ, గబ్బట యాకలక్ష్మి, అలువాల సరిత తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

◆ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
◆ హసన్‌పర్తిలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హసన్‌పర్తి మండల కేంద్రంలోని టీటీఎస్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రోహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు ఎక్సైజ్ స్టేషన్ సీఐ దుర్గాభవానిని కుర్చీలో కూర్చోబెట్టి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్టేషన్ పరిధిలోని ప్రాంతాలు, అధికారాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నాగరాజు ఎక్సైజ్ అధికారులకు కీలక సూచనలు చేస్తూ, తమ పరిధిలో డ్రగ్స్, గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలు లేకుండా నిర్మూలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హసన్‌పర్తిలో ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను 'డ్రగ్స్ ఫ్రీ స్టేట్'గా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత మత్తును వదిలి మైదానాల్లోకి రావాలని, గంజాయి, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్సైజ్ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాల నివారణకై ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీంను ఏర్పాటు చేసిందని తెలిపారు. హసన్‌పర్తి సమీపంలో అనేక కళాశాలలు ఉన్నందున, ఎక్సైజ్ అధికారులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. "ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం ఎక్సైజ్ శాఖ కీలకంగా పనిచేస్తుంది. అక్రమ మద్యం రవాణా, నకిలీ మద్యం తయారీ, గూడ్స్ స్మగ్లింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలను అరికట్టేందుకు ఈ నూతన ఎక్సైజ్ స్టేషన్ మరింత బలంగా సేవలందిస్తుంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ తరపున వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, ఎక్సైజ్ డీపీఓ వరంగల్ అర్బన్ చంద్రశేఖర్, స్థానిక ఎక్సైజ్ సీఐ దుర్గా భవానీ, ఎస్ఐ వెంకన్న, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
■ రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, కాజీపేట :** నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి డివిజన్‌లో కార్యక్రమాలను చేపడుతున్నామని, రానున్న రోజుల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి 62వ డివిజన్ సోమిడిలో సుమారు ₹1.20 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో ఉన్న కాజీపేట ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రధాన సమస్యలను గుర్తించి, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు తమ సహకారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, సయ్యద్ విజయశ్రీ రాజాలి, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రమోషన్లు అందని ద్రాక్షేనా..

● నాన్-టీచింగ్ సిబ్బంది ఆవేదన
● అర్హతలున్నా జాప్యంపై ఆగ్రహం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న నాన్-టీచింగ్ సిబ్బంది ప్రమోషన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రమోషన్ పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నా, అధికారులు ప్రమోషన్లను నిలిపివేయడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాన్-టీచింగ్ సిబ్బంది ప్రధానంగా లేవనెత్తుతున్న అంశం ఏమిటంటే, గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలోని వీఆర్ఏ, వీఆర్వో పోస్టులలో పనిచేస్తున్న కొందరిని ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలోకి తీసుకోవడం జరిగింది. "ఇంటర్ విద్యలోనే ఉద్యోగం పొంది ఏళ్ల తరబడి పనిచేసిన మాకు, వేరే వ్యవస్థ నుండి వచ్చిన వీఆర్ఏ, వీఆర్వోలకు తేడా లేకుండా ప్రమోషన్లు ఆపడం ఎంతవరకు సమంజసం? వారిని సాకుగా చూపి, నిబంధనల ప్రకారం మాకు రావలసిన ప్రమోషన్లను ఎందుకు నిలిపివేస్తున్నారు?" అని ఉద్యోగులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రమోషన్ల ప్రక్రియలో జాప్యంపై సిబ్బంది అసంతృప్తిగా ఉన్నారు. జూలై చివరి వారంలో ప్రమోషన్ల కోసం అధికారులు తమ సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. నవంబర్ 11న టెలిఫోన్ కౌన్సిలింగ్ కూడా పూర్తయింది. 2023-24 సంవత్సరానికి పూర్తిస్థాయి ప్రమోషన్లు నిర్వహించలేదు. 2024-25 సంవత్సరానికి కాల్ ఫర్ చేసి, కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాత ఆర్డర్‌లు వస్తాయని ఆశగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఉద్యోగులకు, వీఆర్ఏలు, వీఆర్వోల అంశాన్ని ముడిపెట్టి ప్రమోషన్లు ఆపడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఆఫీసర్లు, నాయకుల అండదండలతో ప్రమోషన్లు ఇవ్వకుండా ఆపుతున్నారని నాన్-టీచింగ్ స్టాఫ్ ఆరోపిస్తున్నారు. "వీఆర్ఏ, వీఆర్వోలతో మా ప్రమోషన్ల విషయంలో ముడి పెట్టడం సరికాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఇంటర్ విద్య అధికారులు మాపై దయతలిచి, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ ప్రకారం మాకు రావలసిన ప్రమోషన్లను తక్షణమే మంజూరు చేయాలి" అని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎక్సైజ్ సీఐకు శుభాకాంక్షలు తెలిపిన యూనియన్ నేతలు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రోహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా, ఎక్సైజ్ యూనియన్ సభ్యులు నూతన సిబ్బందికి, అధికారులకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ యూనియన్ నాయకులు, నూతన స్టేషన్ ద్వారా అక్రమ మద్యం, మత్తు పదార్థాల నివారణ మరింత పటిష్టం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన యూనియన్ సభ్యుల వివరాలు. ప్రెసిడెంట్ ఎండీ. రబ్బాని, జనరల్ సెక్రటరీ బొల్లెపల్లి రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్లుగా లింగేశ్వర్, ముత్యాల రమేష్, జాయింట్ సెక్రటరీ గుర్రపు రాజమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాళ్ల వెంకటేష్, ప్రెస్ సెక్రటరీ వి.శరత్ కుమార్ లు పాల్గొని నూతన స్టేషన్ విజయవంతంగా పనిచేయాలని యూనియన్ నాయకులు ఆకాంక్షించారు.

# మావోయిస్టులు కోర్టులో లొంగిపోవాలి

న్యాయవాది కలకోటి మహేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఇటీవల జరిగిన 'ఆపరేషన్ కగార్'లో భాగంగా వరుస ఎన్‌కౌంటర్లు, బూటకపు ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్న సందర్భంలో, మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న లేదా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి న్యాయవాది కలకోటి మహేందర్ కీలక సూచన చేశారు. 'పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రాణాలకు ముప్పుందని భావించే మావోయిస్టులు, ప్రజాస్వామ్యబద్ధంగా జీవించాలనుకునే వారు నేరుగా కోర్టులో సరెండర్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు' అని అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థ ద్వారా తమ ప్రాణాలకు ముప్పు ఉందని భావించే మావోయిస్టులు, కోర్టును ఆశ్రయించడం ద్వారా రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా తమ జీవించే హక్కులను కాపాడుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. "జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షించే అధికారం మన న్యాయ వ్యవస్థకు ఉంది. సిద్ధాంతాలను ప్రజాస్వామ్యయుతంగా మలుచుకోవాలి. ప్రాణాల కంటే ముఖ్యం ఏదీ కాదు" అని న్యాయవాది మహేందర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందువల్ల, లొంగిపోవాలని నిర్ణయించుకున్న మావోయిస్టులు కోర్టు ద్వారా న్యాయపరమైన రక్షణ పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మండల టీఎస్ యూటీఎఫ్ 12వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. నూతన కమిటీలోకి ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖ్య నాయకులు మండలాధ్యక్షుడు ఎండీ అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా అనిత, రామకృష్ణ, కోశాధికారిగా లక్ష్మి ప్రసాద్, కార్యదర్శులుగా వరలక్ష్మి, శాంత కుమారి, బుచ్చయ్య, అజయ్ సింగ్, సీతారామారావు, సందీప్, ఆడిట్ కమిటీ కన్వీనర్లు సీతారాములు, రాజు, జిల్లా డెలిగేట్స్ గా వివేక్, సాహెబ్ అలీ, శంకర్, సోమనబోయిన శ్రీనివాస, సురేష్, కాంప్లెక్స్ కన్వీనర్లు (ముల్కలపల్లి) అమీన్, (డోర్నకల్) అమీనా బి, (చిలుకోడు) సతీష్ లు ఉన్నారు. ఈ ఎన్నికలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం.మురళీ కృష్ణ పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు నామ వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతనంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన అబ్దుల్ అజీజ్, శివ ప్రసాద్ మాట్లాడుతూ తమను తిరిగి నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల:** వరంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, నాయకులు బొచ్చు జెమిని తదితరులు కలిసి ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. పరకాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు హాజరై, వెంకట్రామ్ రెడ్డికి శాలువాలు కప్పి సన్మానించారు.

# అరుదైన గుండె శస్త్రచికిత్స విజయవంతం

## ◆ యశోద హాస్పిటల్ డాక్టర్ విశాల్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మృత్యువు అంచుల వరకు వెళ్లిన వరంగల్‌కు చెందిన రోగి భద్రుకు, యశోద హాస్పిటల్స్ (సికింద్రాబాద్) కు చెందిన ప్రఖ్యాత సీటీసీఎస్ సర్జన్ డా.విశాల్ బృందం అరుదైన, అత్యంత సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్స చేసి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో ఒకప్పుడు మంచం నుంచి కదల్లేని స్థితిలో ఉన్న భద్రు, ఇప్పుడు ఉల్లాసంగా తన వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన భద్రు తీవ్రంగా శ్వాస ఆడకపోవడం, పల్పిటేషన్ వంటి గుండె వైఫల్య లక్షణాలతో డాక్టర్ విశాల్‌ను సంప్రదించారు. అతని పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే, అతను బాత్రూమ్‌కు కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నాడు. గుండె స్కాన్, ఎంఆర్ఐ వంటి అత్యాధునిక పరీక్షలలో డాక్టర్ విశాల్ బృందం ఒక అరుదైన, ప్రమాదకరమైన సమస్యను గుర్తించింది. బృహద్ధమని కవాటం (Aortic Valve) లీకవడం, గుండె కండరాలలోకి బృహద్ధమని చీలిపోవం జరిగింది. డాక్టర్ విశాల్ మాటల ప్రకారం "సాధారణంగా బృహద్ధమని గుండె గదిలోకి చీలిపోతుంది. కానీ, గుండె కండరాలలోకి చీలిపోవడం అనేది ప్రపంచంలోనే చాలా అరుదైన కేసు, రోగి చాలా తీవ్రమైన స్థితిలో ఉన్నాడు." ఈ అసాధారణ చీలిక కారణంగానే భద్రుకు గుండె వైఫల్యం వచ్చింది. రోగి బంధువులకు పరిస్థితి తీవ్రతను, ప్రమాదాన్ని వివరించిన తర్వాత, డాక్టర్ విశాల్ బృందం ఎంతో ప్రయత్నంతో శస్త్రచికిత్సను చేపట్టింది. ఈ కేసులో లీక్ అయిన గుండె కవాటాన్ని మార్చారు. గుండె కండరాలలో ఏర్పడిన చీలికను గుండెకు మధ్య ఉన్న సంబంధాన్ని విజయవంతంగా మూసివేశారు. శస్త్రచికిత్స తర్వాత భద్రు చాలా బాగా కోలుకున్నారు. "మరణిస్తున్న ఒక రోగి ఒక ఆశతో మా వద్దకు వచ్చాడు. మేము ఎంతో ప్రయత్నించాము, ఈ రోజు దానికి ఫలితం ఉంది. అతను ఇప్పుడు తన వ్యవసాయ పనులు చేసుకుంటూ కష్టపడి పనిచేస్తున్నాడు," అని డాక్టర్ విశాల్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసును డాక్టర్ విశాల్ అరుదైన వైద్య విజయంగా అభివర్ణించారు. ఇది ప్రపంచంలోనే చాలా అరుదైన, బృహద్ధమని కండరాలలోకి చీలిక జరిగిన కేసును జాగ్రత్తగా ప్లాన్ చేసి, సంక్లిష్టమైన విధానాలను అనుసరించడం ద్వారా బృందం అద్భుతమైన ఫలితం సాధించింది. యశోద హాస్పిటల్ (సికింద్రాబాద్) అన్ని రకాల సంక్లిష్టమైన గుండె కేసులను అత్యుత్తమ ఫలితాలతో చేయగల సామర్థ్యాన్ని ఈ కేసు నిరూపించిందని డాక్టర్ విశాల్ తెలిపారు. యశోద హాస్పిటల్స్ (సికింద్రాబాద్) గుండె, ఊపిరితిత్తుల మార్పిడి వంటి సంక్లిష్టమైన చికిత్సలలో కూడా మంచి ఫలితాలను అందిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# పాఠశాలలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎంపీడీవో) రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం రుచిగా, నాణ్యంగా ఉందని ఎంపీడీవో సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాల పరిసరాల పరిశుభ్రత చాలా బాగుందని పేర్కొంటూ, ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పరిశీలన అనంతరం, ఎంపీడీవో పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించి, అక్కడి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, అంగన్వాడీ టీచర్లు బీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని వెంకటేశ్వర్లపల్లె గ్రామంలో మాదారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డితో కలిసి ఈ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించి, కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పీఏసీఎస్ సభ్యులు అంజిరెడ్డి, రవీందర్, వీరేశలింగం, విక్రమ్ రెడ్డి, సీఈఓ రాజేందర్, ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారి), ఇతర ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని చర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామంలోని మహిళా భవన్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులైన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక నాయకులు హాజరయ్యారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డితో పాటు మాజీ ఎంపీటీసీ బొల్లారం ఆనందం, గ్రామ పార్టీ అధ్యక్షుడు చాడ రవీందర్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్లు రాజ్ కుమార్, అనిల్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శనిగరపు జోసెఫ్, యూత్ కమిటీ సభ్యులు శనిగరపు మహిపాల్, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. "వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో టీడీపీ మండల అధ్యక్షులు గోనె మధుకర్, కాంగ్రెస్ నాయకులు, కో-ఆప్షన్ సభ్యులు అన్నం రాజు, కాంగ్రెస్ నాయకులు అన్నం మొగిలి, నామాని యాదగిరి, మారేడుగొండ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ సర్పంచ్ సావు రాజేశ్వర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు రాయరాకుల రవీందర్, కార్యదర్శి మోతే రమేష్, మాజీ సొసైటీ చైర్మన్ నాగనబోయిన సాంబయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ లకిడే శివరామ్, యూత్ నాయకులు వేల్పుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# దామెరలో ఇందిరమ్మ చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర :** దామెర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గుమ్మడి కల్పన, గ్రామం స్పెషల్ ఆఫీసర్ కె.వి. రంగాచారి హాజరయ్యారు. చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పథకాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శి బి.మనోహర్, సీసీలు, వివోఏలు, మహిళా సంఘం అధ్యక్షురాలు, సభ్యులు పాల్గొన్నారు.

# అమ్మపాలెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మండలంలోని అమ్మపాలెం గ్రామ సరిహద్దులో ఐకేపీ (ఇంటిగ్రేటెడ్ గిరిజన అభివృద్ధి సంస్థ) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామ రైతులు కోరారు. ఈ సందర్భంగా రైతులు స్థానిక ఎమ్మార్వో రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో కొనుగోలు కేంద్రం బంజర గ్రామంలో ఉండేదని, అయితే ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులది కావడంతో, సదరు రైతులు తిరిగి ఆ భూమిని కొనుగోలు కేంద్రం కోసం ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో అక్కడ కేంద్రం ఏర్పాటు చేయడం ఇబ్బందికరంగా మారింది. దీనికి ప్రత్యామ్నాయంగా, అమ్మపాలెం గ్రామ సమీపంలో సుమారు పది ఎకరాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ఎమ్మార్వోకు సూచించారు. రైతుల సమస్యపై ఎమ్మార్వో రాఘవరెడ్డి గారు సానుకూలంగా స్పందించారు. వెంటనే స్థల పరిశీలన చేసి, సమస్యను ఉన్నతాధికారులకు ఫోన్‌లో వివరించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని అమ్మపాలెం గ్రామంలో ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మార్వో హామీతో అమ్మపాలెం గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# సెంట్రల్ జోన్ డీసీపీగా దారా కవిత బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ జోన్ నూతన డీసీపీ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్)గా దారా కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆమె హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ విభాగంలో పనిచేస్తూ, బదిలీపై వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా నియమించబడ్డారు. నూతన డీసీపీగా దారా కవిత బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సెంట్రల్ జోన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆమెను కలుసుకున్నారు. వారు పుష్పగుచ్ఛాలు అందజేసి, నూతన డీసీపీకి అభినందనలు తెలియజేశారు.

# ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులు సీజ్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నిబంధనలకు భిన్నంగా, ఎలాంటి ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను తక్షణమే సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నాయకులు తీవ్రంగా డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని చింతగట్టులో గల ఆర్టీవో కార్యాలయంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కిషోర్ బాబుకు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యాలు కేవలం ఒకటి లేదా రెండు బస్సులకు మాత్రమే ఆర్టీవో కార్యాలయంలో ఫిట్‌నెస్ తనిఖీ చేయించుకుని, 4 నుంచి 20 వరకు ఫిట్‌నెస్ లేని బస్సులను యథేచ్ఛగా రోడ్లపై నడుపుతున్నాయి. ప్రైవేట్ స్కూల్ బస్సులు నడపాలంటే ప్రభుత్వం సూచించిన 13 ముఖ్య నియమ నిబంధనలు పాటించాల్సి ఉన్నా, ఏ ఒక్క నిబంధనను కూడా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. బస్సుల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. బస్సుల్లో కనీసం మెడికల్ కిట్లు, అటెండెంట్లు, ఫైర్ సేఫ్టీ పరికరాలు కూడా అందుబాటులో ఉండటం లేదు. విద్యార్థులు కూర్చునే సామర్థ్యానికి విరుద్ధంగా అధిక లోడ్‌తో, ప్రమాదకర రీతిలో విద్యార్థులను తరలిస్తున్నారు. బస్సు డ్రైవర్లకు ఉదయం, సాయంత్రం బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించకుండానే బస్సులు నడుపుతున్నారు. కొన్ని పాఠశాలలు తమ బస్సులను సొంత స్థలంలో పార్కింగ్ చేయకుండా, రోడ్లపై, ప్రభుత్వ స్థలాలలో పార్కింగ్ చేస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. యాజమాన్యాలు బస్ డ్రైవర్లకు సంబంధించిన లైసెన్స్, ఇతర పత్రాలను ఒకరికి బదులు మరొకరివి అధికారులకు చూపిస్తూ మోసం చేస్తున్నారని నేతలు ఆరోపించారు. అంతేకాకుండా, కనీస వేతనాల చట్టం ప్రకారం జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్, ఈపీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకుండా డ్రైవర్లను మోసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత రవాణా శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాల బస్సులను తక్షణమే సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని, రవాణా శాఖ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొగిలి వెంకట్ రెడ్డి (పీడీఎస్ యూ), గడ్డం నాగార్జున (ఏఐఎఫ్ డీఎస్), ఎం.ఏ హకీమ్ నవీద్ (ఏఐఎస్ బీ), బాష బోయిన సంతోష్ (ఏఐఎస్ఎఫ్), బి.నరసింహ రావు (పీడీఎస్ యూ), మంద శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ), మాస్ సావిత్రి (ఏఐఎఫ్ డీఎస్), రాచకొండ రంజిత్ (పీడీఎస్ యూ), శ్రీపతి వినయ్ (ఏఐఎస్ఎఫ్), జస్వంత్ (ఎస్ఎఫ్ఐ), పి.అనూష (పీడీఎస్ యూ) తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన పాలకుర్తి కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నార్సింగ్‌లో ఉన్న ఆయన స్వగృహంలో పెదగాని సోమన్న నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, తాజా రాజకీయ పరిస్థితుల గురించి వారు మహేష్ కుమార్ గౌడ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, ఎడ్ల వెంకట్ రెడ్డి, ముద్దం మహబూబ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ముద్దం విక్రమ్ రెడ్డి, రాములు, హరీష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంధం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగాల వెంకట్రామిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** వరంగల్ కుడా చైర్మన్, ఆత్మకూరు ముద్దుబిడ్డ ఇనుగాల వెంకట్రామిరెడ్డి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, ఆత్మకూరు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆత్మకూరు మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ హనుమకొండలో డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డిని కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎంపీపీ మార్క సుమలత రజినీకర్, మాజీ జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, మాజీ సర్పంచ్ బూర రాజేందర్, మండల నాయకులు గఫూర్, శంకర్, బాబు తదితరులు ఉన్నారు. వీరందరూ నూతన డీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛాలు అందజేసి, జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# గ్రామాల అభివృద్ధికి మహార్దశ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధికి మహార్దశ వస్తుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి నాణ్యతమైన సీసీ రోడ్లు మరియు సైడ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆయన విమర్శించారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పరకాల నియోజకవర్గంలో త్వరలో డైరీని ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న లేదా అమలు చేయబోతున్న ముఖ్య సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలకు నిజమైన అభివృద్ధి చేరుకుంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కామారం గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు

## డీసీపీ ఆధ్వర్యంలో 16 కెమెరాల ఏర్పాటు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని కామారం గ్రామంలో భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సోమవారం కీలక ముందడుగు పడింది. గ్రామ భద్రత కోసం మొత్తం 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం డీసీపీ ఆధ్వర్యంలో గ్రామ ప్రముఖులు మూల మధుకర్, రుద్ర కన్సల్టెంట్స్ వారి సహకారంతో జరిగింది. తన స్వగ్రామాన్ని మరింత సురక్షితంగా మార్చాలనే సంకల్పంతో, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు మూల మధుకర్ తెలిపారు. ఇది గ్రామంలోని నేరాలను నియంత్రించడంలో, భద్రతా ప్రమాణాలను పెంచడంలో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు. గ్రామ భద్రత కోసం ముందడుగు వేసిన మూల మధుకర్‌ను గ్రామ ప్రజలతో కలిసి పోలీసు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# 26న రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరపాలి



**వరంగల్ వాయిస్, గణపురం:** రాజ్యాంగ పితామహుడు, భారతరత్న డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని (నవంబర్ 26) గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని గణపురం మండల అంబేద్కర్ యువజన సంఘం పిలుపునిచ్చింది. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఈ మేరకు డిమాండ్ చేశారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఘనంగా జరపాలని వారు కోరారు. గ్రామాలలో అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని కోరారు. పార్టీలకతీతంగా యువజన సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు మరియు యువత ఈ వేడుకల్లో పాల్గొని, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, హక్కులను గుర్తుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు ముప్పిడి శంకర్, సినీ నటులు సైదులు కామెడీ, బీఎస్పీ భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మేకల ఓంకార్, మండల నాయకులు చిలువేరు ఉదయాకర్, ఇంజపెల్లి రవికుమార్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు పెంచాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి

## సీఎం రేవంత్ రెడ్డికి ఎన్ హెచ్ఎం ఉద్యోగుల విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తమ సమస్యలను మీడియా ద్వారా విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ ఖన్నా ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో కీలక సేవలు అందిస్తున్న ఎన్ హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. "ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశం కాదు. అనేక సంవత్సరాలుగా కష్టపడుతున్న మా ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. ఎన్ హెచ్ఎం యూనియన్ ప్రభుత్వం ముందుంచిన ప్రధాన డిమాండ్లు కింది విధంగా ఉన్నాయి. 2018 నుంచి 2025 వరకు అన్ని కేడర్‌ల ఉద్యోగులకు 510 జీవో ప్రకారం వేతనాలను పెంచాలి. ఎన్ హెచ్ఎంలో పనిచేస్తున్న అన్ని కేడర్‌ల ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. చాలా సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. హర్యానా, మణిపూర్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఉద్యోగులను క్రమబద్ధీకరించిన తరహాలో, తెలంగాణలో కూడా NHM ఆల్ కేడర్‌ల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. ప్రతి ఉద్యోగికి హెల్త్ కార్డులు మరియు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని వర్తింపజేయాలి. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలలో ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులను వారి కేడర్ వైజ్ విలీనం చేయాలి. ఎన్ టీఈపీలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పెట్రోల్ అలవెన్సులు, టీఏ, డీఏ కింద ఉన్న 36 నెలల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. అన్ని కేడర్‌ల ఉద్యోగులకు సంవత్సరానికి 35 క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయాలి. ఎన్ హెచ్ఎం ఉద్యోగి మరణించినట్లయితే, వారి కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి 6 నెలల్లోపు కారుణ్య నియామకం చేపట్టాలి. ప్రభుత్వం విడుదల చేసిన 1195 మరియు 1187 జీవోలను వెంటనే ఉద్యోగులకు అమలు చేయాలి. ఈ డిమాండ్లను పరిశీలించి, వెంటనే న్యాయం చేయాలని ఎన్ హెచ్ఎం యూనియన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తోంది.



# సేవా నినాదంతో ముందుకు రోటరీ

◆ రోటరీ క్లబ్ సెంట్రల్‌లో నూతన సభ్యుల చేరిక

◆ ప్రపంచవ్యాప్త సేవలపై చర్చ



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో రత్న హోటల్ లో రోటరీ క్లబ్ కుటుంబ సభ్యుల మధ్య నూతన సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షుడు మదూరి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ శరత్ బాబు, మదూరి గణేష్ గారు హాజరయ్యారు. నూతనంగా క్లబ్‌లో చేరిన వారికి ముఖ్య అతిథులు ప్రమాణస్వీకారం చేయించి, రోటరీ పిన్ అందించి స్వాగతం పలికారు. కొత్తగా సభ్యులైన వారిలో డాక్టర్ అవినాష్ (క్యాన్సర్ స్పెషలిస్ట్), డాక్టర్ సుజీత్ (ఆర్ఎంఓ), ములుగు వ్యాపారస్తులు శ్రవణ్ కుమార్, పొట్టి రాజేష్ ఉన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ 'ఫ్రెండ్‌షిప్, ఫెలోషిప్ అండ్ సర్వీస్' అనే నినాదంతో 120 సంవత్సరాల క్రితం ప్రారంభమైన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలబడిందని కొనియాడారు. వరంగల్ రోటరీ క్లబ్ సెంట్రల్ వరంగల్ పట్టణంలోనూ విస్తృత సేవలు అందిస్తోంది. డాక్టర్ శరత్ బాబు ఆధ్వర్యంలో 25 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను పేద ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచారు. గ్లోబల్ గ్రాంట్స్ ద్వారా పేద ప్రజలకు విద్య, వైద్యం, శానిటేషన్ వంటి ప్రథమ హక్కులను అందించడంలో ముందుంది. భూపాలపల్లి, జనగామ జిల్లాలలో విజన్ సెంటర్స్ మొదలుపెట్టి ఉచిత కంటి నిర్ధారణలు, చికిత్సలు అందిస్తోంది. స్వచ్ఛమైన నీరు కోసం వాటర్ ప్లాంట్స్, నిరుపేదలైన ప్రజలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు, ప్రభుత్వ స్కూళ్లలోని ఆడపిల్లలకు సైకిల్స్, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం కోసం ప్రోటీన్ పౌడర్స్ అందించారు. రాబోవు రోజుల్లో ఎంజీఎం హాస్పిటల్ నందు నెలలు నిండని, అంగ వైకల్యంతో పుట్టిన పిల్లల కోసం నూతన ఎక్విప్‌మెంట్ (NICU) ను రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ద్వారా ఉచితంగా అందించనుంది. అమెరికా నుంచి డాక్టర్లు వచ్చి ఇక్కడి సిబ్బందికి ఒక నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలోనే వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లుగా ఎన్నికైన క్లబ్ సభ్యులు చకిలం ఉపేందర్ (ప్రముఖ న్యాయవాది), తోట జగన్నాథం, పొన్న హరినాథ్, వద్నాల సదానందంలను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటేరియన్లు కోరే చంద్రమౌళి, బేతి అశోక్ బాబు, జూలూరి కృష్ణమూర్తి, తోట సంపత్, బండారి కుమారస్వామి, రాజేందర్ కిరణ్, పోరండ్ల రత్నాకర్, ఇతర రోటరీ మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించవద్దు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని, ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర పొందాలని పరకాల మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ అన్నారు. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు గారి ఆదేశం మేరకు సోమవారం శాయంపేట మండలంలోని కాట్రపల్లి సూర్య నాయక్ తండా, గోవిందాపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వేణుగోపాలరావు, శాయంపేట పీఏసీఎస్ సీఈవో రాజమోహన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైనాల కుమారస్వామి, చిందం రవి, దుబాస్ కృష్ణమూర్తి, మారపెల్లి కట్టయ్య, జగన్, రఘు సింగ్, లక్ష్మణరావు, మొగిలి మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం శ్రీకారం



**వరంగల్ వాయిస్, నడికూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని, సాధికారతను పెంచే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నడికూడ మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో ఘనంగా జరిగింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ బుర్ర దీపా-దేవేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చీరలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ నాగేశ్వర రావు, మహిళా సంఘం లీడర్ సీఏ లావణ్య రెడ్డి, వీవో/ఓబీ అధ్యక్షురాలు స్వరూప, సభ్యులు పాడి ప్రవళిక, ముంజ రమ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంక్క జువ్వ కుమారస్వామి, కోశాధికారి తలగంప్ప రాజు, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు గుర్రాల సాంబ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు: బుర్ర సురేందర్, తిపర్తి తిరుపతి రెడ్డి, సుష్మిత, ఆవుల సుమన్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం ఆరు చరణాలూ పూర్తి గీతమే



**వరంగల్ వాయిస్, పరకాల :** వందేమాతరం గీతం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, పరకాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో సామూహిక వందేమాతరం గీతాలాపన జరిగింది. పరకాల పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ పతాకాలతో ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గ బీజేపీ నేత పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, వందేమాతరం పూర్తి ఆరు చరణాలతోపాటు దాని భావాన్ని ప్రతి భారతీయుడు గర్వంగా గానం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు సిరంగి సంతోష్ కుమార్, కాచం గురుప్రసాద్, ఆర్ పి జయంతి లాల్, చందుపట్ల రాజేందర్రెడ్డి, బెజ్జంకి పూర్ణ చారి, ఎర్రం రామన్న, మేకల రాజవీరు, ప్రధాన కార్యదర్శిలు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, బీజేపీ జిల్లా నాయకులు కుక్కల విజయ్ కుమార్, మార్త బిక్షపతి, మార్త రాజభద్రయ్య, భాస్కరాచారి, దంచనాల సత్యం, మై భారత్ ఇంచార్జ్ వావిలాల వెంకటరమణ, బల్స గురి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



**వరంగల్ వాయిస్, తరిగొప్పుల :** జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం తరిగొప్పుల మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రభుత్వ కార్యక్రమాలను తనిఖీ చేసి, మహిళా సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మొదటగా నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి అర్హత కలిగిన మహిళకు చీర అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఆ తర్వాత అబ్దుల్ నాగారం గ్రామంలో కూడా చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం, అబ్దుల్ నాగారంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రిజిస్టర్లను పరిశీలించారు. చివరగా కలెక్టర్ అదే మండలంలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీవీబీ) సందర్శించారు. అక్కడ మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించారు. సరుకులను ఎప్పటికప్పుడు తాజాగా తెప్పించుకోవాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

## సుజాత మృతి సీపీఎంకు తీరని లోటు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు గోపగోని సుజాత మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. సోమవారం రఘునాథపల్లి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గోపగోని సుజాత పార్థివ దేహానికి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ సుజాత ఆదివారం రాత్రి 11గంటల సమయంలో హార్ట్ ఎటాక్ రావడంతో జనగామ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తు చేస్తూ 2002 సంవత్సరం నుంచి సీపీఎం పార్టీలో చేరి క్రియాశీలక సభ్యురాలుగా కొనసాగారు. 2006లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి వార్డు మెంబర్‌గా గెలుపొందారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, మొక్కవోని దీక్షతో పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉన్నారు.సీపీఎం మండల కమిటీ, గ్రామ శాఖ కలిసి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పోత్కనూరి ఉపేందర్, మండల కమిటీ సభ్యులు మైలారం వెంకటేశ్వర్లు, నామాల యాదగిరి, పార్టీ సీనియర్ నాయకులు భీమగోని చంద్రయ్య, కడారి ఆంజనేయులు, మండల నాయకులు వంగాల ఎల్లేష్, తుడి ఐలయ్య, కక్కెర్ల రామ్ నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ క్వెస్ట్ శిక్షణా శిబిరం ప్రారంభం



**వరంగల్ వాయిస్, జనగామ :** విద్యార్థుల్లో నైతిక విలువలు, పాజిటివ్ లెర్నింగ్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం వంటి అంశాలపై బోధనాంశాలు గల లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం విద్యార్థులకు ఒక వరం లాంటిదని లయన్స్ క్వెస్ట్ మాస్టర్ ట్రైనర్ లయన్ కొండపల్లి రేణుక అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉపాధ్యాయ శిక్షణా శిబిరంలో ఆమె శిక్షణ ఇస్తున్నారు. సోమవారం ఉదయం జరిగిన శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి క్వెస్ట్ జిల్లా చైర్మన్ లయన్ కానుగంటి సుభాష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా విద్యార్థులు తమ సత్ప్రవర్తన ద్వారా ఉత్తమ పౌరులుగా రాణించడానికి లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంలో లయన్ కొండపల్లి రేణుక అందిస్తున్న సహకారం అద్భుతమని ఆయన కొనియాడారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ టీం సభ్యులను అభినందించారు. క్వెస్ట్ జిల్లా చైర్మన్ లయన్ కానుగంటి సుభాష్ మాట్లాడుతూ... పట్టణ పరిధిలోని పది పాఠశాలల నుంచి 25 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారని, రెండు రోజుల పాటు వారు పాటించవలసిన నియమాలను వివరించారు. ఏకశిల పబ్లిక్ స్కూల్, గీతాంజలి ఉన్నత పాఠశాల, శ్రీ అరబిందో హైస్కూల్, ఎస్పీఆర్ హైస్కూల్, సాన్ మారియా హైస్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్ హైదరాబాద్ రోడ్, సెయింట్ పాల్స్ హైస్కూల్, గౌతం మోడల్ స్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్ టౌన్ పాఠశాలల నుంచి 25 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ లయన్ రామిని శ్రీనివాసులు అభ్యాసకులకు అభినందనలు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ కారంపూడి సత్యనారాయణ, కోశాధికారి లయన్ సుదగాని ప్రవీణ్, శిబిరం కోఆర్డినేటర్ లయన్ కె. రాజశేఖర్ రెడ్డి, ఏకశిల బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 24 నవంబర్ 2025


# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం



నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈతా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈతా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.

## విడుదలకు ముందే పెద్ది రికార్డులు

### చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్

విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడిరచింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.




## ఫిబ్రవరి 13న స్వయంభు




భారీ అంచనాలతో నిర్మాణం ఒక సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్స్.. వేల సవాళ్లు..' అంటూ 'స్వయంభు' విడుదల తేదీని ప్రకటించారు హీరో 'నిఖిల్'. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల కానున్నట్లు తెలుపుతూ వీడియో విడుదల చేశారు. హీరో నిఖిల్ సిద్దార్థ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంలో ఉన్నారు. అయితే , ఈ రోజు మేకర్స్ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిఖిల్ ఇప్పుడు మళ్లీ పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా వచ్చే ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషలలో మూవీని రిలీజ్ చేయనున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని టీమ్ వెల్లడిరచింది. విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా, మేకర్స్ 'రైజ్ ఆఫ్ స్వయంభు' అనే స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిత్రంలోని భారీ స్కేల్, యుద్ధ సన్నివేశాలు, పీరియడ్ సెట్లు, నిఖిల్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోతో చిత్రం పై ఉన్న హైప్ మరింత పెరిగింది. త్వరలో ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రంలో సమ్యుక్తా, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఇద్దరి పాత్రలు కూడా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్టు సమాచారం.

## ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా రాజాసాబ్



పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి ఎన్టీఆర్ అభమానులకు క్షమాపణలు

ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి 'ది రాజాసాబ్' ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది రాజాసాబ్'. తాజాగా ఈ సినిమా నుంచి 'రెబల్ సాబ్' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'రెబల్ సాబ్'ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది. ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు.

మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు. రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. 'కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు' అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. '

## కేవీఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి

ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడిరచలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి ` బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.



# మేం కట్టం.. వేరే వాళ్లను కట్టనివ్వం !

- దిక్కున్న చోట చెప్పుకో..
- తాపీ మేస్త్రీ సంఘం జులూం
- ఇంటి యజమానికి బెదిరింపులు
- వరంగల్ రామన్నపేటలో ఘటన
- మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :**ఇంటి కోసం రూ. 1 లక్ష అడ్వాన్స్ తీసుకొని, కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేపట్టాడో తాపీ మేస్త్రీ. మొత్తం రూ. 11 లక్షలకు అగ్రిమెంట్ చేసుకోగా.. విడతలవారీగా రూ. 4 లక్షలు చెల్లించాడు సదరు యజమాని. డబ్బులు తీసుకున్నప్పటికీ పని సక్రమంగా చేపట్టకపోవడంతో స్లాబ్ బీటలువారి.. పిల్లర్లు కుంగిపోయే పరిస్థితి నెలకొంది. బిత్తరపోయిన యజమాని ఇందేటని ప్రశ్నించగా ఉల్టా ఆయన్నే బెదిరిస్తున్నారు తాపీ మేస్త్రీ యూనియన్ నాయకులు. ఒప్పందం ప్రకారం.. మిగిలిన రూ. 6 లక్షలు చెల్లించాల్సిందేనని.. గొడవ చేసినందున అగ్రిమెంట్ కాన్సిల్ అవుతుందని .. లేదా పాత మేస్త్రీతో పనులు చేయించాలంటే రూ. 15 లక్షలు కట్టాల్సిందేనని జులూం ప్రదర్శిస్తున్నారు. అలా కుదరకపోతే.. మేం కట్టం.. వేరే వాళ్లను కట్టనియ్యం.. అంటూ హెచ్చరిస్తూ యజమానిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాధితుడు చేసేదేంలేక పోలీసులను ఆశ్రయించారు. వరంగల్ రామన్నపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది.

## అసలేం జరిగింది

బాధితుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్‌లోని ఇంటి నెంబర్ 15-7-247/1 రామన్నపేటకు చెందిన కడారి ఆశాలు అనే వ్యక్తి అదే కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. కాలనీకి చెందిన దుబ్యాల కృష్ణ అనే తాపీమేస్త్రీతో తన భవనంపై రెండో అంతస్తు నిర్మాణం కోసం పెద్ద మనుషుల సమక్షంలో రూ. 11 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అడ్వాన్స్‌గా మొదట రూ. లక్ష తాపీమేస్త్రికి అందజేశాడు. ఆ తర్వాత రూ. 3 లక్షల నగదుతోపాటు 1 లక్ష విలువైన మెటీరియల్ అందజేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. నిర్మాణ పనుల్లో తాపీ మేస్త్రీ కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. తూతూమంత్రంగా పనులు ముగించాడని బాధితుడు వాపోతున్నాడు.

## స్లాబ్‌లో బీటలు ..

స్లాబ్‌లో బీటలు పడ్డ దగ్గర కెమికల్‌తో పూర్తి చేయకుండానే అంతస్తు పిల్లర్లను నిర్మించాడు. మరుసటి రోజు నుంచి వర్షాలు పడడంతో కింది అంతస్తు మొత్తం కురుస్తున్నది. ఇల్లు మొత్తం షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. స్లాబ్ ఇష్టం వచ్చినట్లు పోయడంతో ఎక్కడి నీరు అక్కడే నిలుస్తున్నది. దీంతో మేస్త్రిని పిలిచి వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేయించాడు. మళ్లీ కొద్ది రోజులకు సెంట్రల్ సెంట్రింగ్‌ను విప్పడంతో స్లాబ్ మొత్తం చీలికలు వచ్చాయి. ఇందేంటని ప్రశ్నించగా.. సదరు సుతారి మేస్త్రీ నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నాడు. పంచాయితీ మేస్త్రీల సంఘంకు చేరడంతో సదరు మేస్త్రీ తరుపున 20 మంది పెద్ద మనుషులు భవనాన్ని పరిశీలించి నాసిరకం పనులు నిజమేనని గుర్తించారు. మరోమారు పది మంది వచ్చి పరిశీలించారు.

## డబ్బులు ఇవ్వడం కుదరదు..

ఆ తర్వాత మీరు సంఘంలో రూ. 4 వేలు కట్టి రసీదు పొందితేనే మేం మాట్లాడతామని చెప్పడంతో సరే అన్న ఇంటి యజమానికి మళ్లీ ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. ఇంటి నిర్మాణంలో నాణ్యత లోపించింది వాస్తమే అని, అందుకు సదరు సుతారి నష్ట పరిహారం కింద రూ. 3 వేలు ఇస్తాడు. మీరు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం.. రూ. 4 లక్షలు మాత్రం తిరిగి ఇవ్వడం కుదరదు అని తేల్చిచెప్పడంతో బాధితుడు బిత్తరపోయాడు. అంతేగాక ఒప్పదం ప్రకారం.. మిగిలిన రూ. 6 లక్షలు చెల్లించాల్సిందేనని.. గొడవ చేసినందున అగ్రిమెంట్ కాన్సిల్ అవుతుందని .. లేదా పాత మేస్త్రీతో పనులు చేయించాలంటే రూ. 15 లక్షలు కట్టాల్సిందేనని బాధితుడిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. అలా కుదరకపోతే.. మేం కట్టం.. వేరే వాళ్లను కట్టనియ్యం.. అంటూ హెచ్చరిస్తూ యజమానిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించగా.. మీరు ఎక్కడికి వెళ్లి ఫిర్యాదుచేసినా పర్వాలేదు. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి.. అంటూ వేధింపులకు గురిచేస్తుండటంతో సదరు ఇంటి యజమాని న్యాయం చేయాలని కోరుతూ కన్నీటిపర్యం అవుతున్నాడు. ఈమేరకు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో తాపీ మేస్త్రిపై ఫిర్యాదు చేశాడు.

# పెండింగ్ పనులు పూర్తి చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉప్పరోని కుంటలో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తిచేయాలని కోరుతూ స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి డిమాండ్ చేవారు. ఈ మేరకు సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న సమయంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ మహానగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత మూడు సంవత్సరాలుగా ఉర్సు ఉప్పరోని కుంట శ్మశాన వాటిక మురుగునీటితో నిండి ఉందని, దీంతో దహన సంస్కారాలు చేయలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. శ్మశాన వాటిక పరిసరాల్లో నివసించే వారు. దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఉప్పరోని కుంటలో పూర్తిస్థాయిలో బాక్స్ డ్రైన్ నిర్మాణం చేయనందున వరద నీరు అంతా ఉప్పరోని కుంట హిందూ శ్మశాన వాటిక, తాళ్ల పద్మావతి కాలేజీ, డీకే నగర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, కురుమ శ్మశానవాటిక, కొత్త కుమ్మరి వాడ, ఉప్పరోనికుంట కాలనీలు నీట మునిగి పోవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మేయర్, కమిషనర్లు జోక్యం చేసుకొని సరైన రీతిలో మార్కింగ్ ఇప్పించి పనులు పూర్చి చేసేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ధర్నాలో పాల్గొన్న ప్రజలు బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మించాలని టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కమిషనర్ బయటికి వచ్చే వరకు అక్కడినుంచి కదిలేది లేదన్నారు. పోలీసు జోక్యంతో శాతించిన కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఇంచార్జి సీపీ రవీందర్ రాడేకర్, ఈఈ సంతోష్ కుమార్ లకు వినతిపత్రం అందజేశారు. దీంతో మూడు రోజుల్లో స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ చేస్తామని వారు హామీ ఇచ్చారు. అంతలోనే మేయర్ గుండు సుధారాణి తన చాంబర్లోకి రాగానే ఆందోళన కారులు కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో అమెకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో స్థానిక నాయకులు మాచర్ల దీన్ దయాల్, ఆవునూర్ కుమార్ స్వామి, బైరి నాగరాజు, పూజారి విజయ్, ఆవునూరి రామ్మూర్తి, చింతకింది రాజు, ఆవునూరి నాగరాజు, వనం కుమార్, కూరపాటి రాజన్ బాబు, పాపయ్య, కెడల ప్రసాద్, మరుపల్ల గౌతమ్, ఎలుగల మానస, నాంపల్లి అంజలి, కాసర్లపల్లి సరస్వతితోపాటు ప్రజలు పాల్గొన్నారు



# నషాముక్తి భారత్ స్ఫూర్తిగా.. నషాముక్తి తెలంగాణ

'నషాముక్తి భారత్' స్ఫూర్తిగా, మన తెలంగాణను 'మత్తు రహిత రాష్ట్రంగా' మార్చాల్సిన తక్షణ అవసరం ఏర్పడింది. రాష్ట్ర యువత బలంగా, ఆరోగ్యకరంగా ఎదగాలంటే వారికి ప్రోత్సాహక వాతావరణం కావాలి. కానీ, ఇటీవల కాలంలో మద్యపానం, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు ప్రజల ఆవేదన వింటుంటే, ఈ సమస్య యొక్క తీవ్రత ఎంత అత్యవసరమో అర్థమవుతోంది. మత్తు అలవాట్ల వల్ల కుటుంబాలు ఎదుర్కొంటున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. చదువులో నిర్లక్ష్యం, లక్ష్యాలు కోల్పోవడం. వ్యసనాల కోసం డబ్బు వృథా చేసి అప్పుల పాలు కావడం. ఇంటింటా అశాంతి, కుటుంబ సంబంధాలు దెబ్బతినడం. ఈ సమస్యపై హనుమకొండ జిల్లాలో జరుగుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయం. పాఠశాల స్థాయిలో చిన్నారులతో వ్యాసరచన, చిత్రలేఖనం, స్లోగన్స్ పోటీలు పెట్టి విజేతలను ప్రోత్సహించడం ద్వారా బాల్యం నుంచే మత్తు వ్యసనాలపై అవగాహన కల్పించవచ్చు. మన జిల్లా పోలీసు యంత్రాంగం కూడా మత్తు పదార్థాల రవాణాదారులు, అమ్మకం దారులపై కఠిన చర్యలు తీసుకోవడం ప్రశంసనీయం. చట్టపరంగా శిక్షలు అమలు చేస్తే ఈ సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చు. యువతకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలు తెలిసినా, అవగాహన లోపం, ఒత్తిడి, వాతావరణ ప్రభావం వంటి కారణాలతో వారు వాటి వైపు ఆకర్షితమవుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే పాఠశాలలు, కళాశాలలు క్రీడలు, కళలు, సేవా కార్యక్రమాల వైపు విద్యార్థులను మళ్లించాలి. యువ సంఘాలు, గ్రామ పంచాయతీలు సమన్వయంతో పనిచేయాలి. పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించడం, సమయాన్ని సద్వినియోగం చేయించడం, శారీరక – మానసిక ఆరోగ్యం పై దృష్టి పెట్టడం వంటి చిన్న ప్రయత్నాలు పెద్ద మార్పుకు దారి తీస్తాయి. ప్రభుత్వం అక్రమ రవాణా, డ్రగ్స్ మాఫియాపై చర్యలు తీసుకున్నా, అది మాత్రమే సరిపోదు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసికట్టుగా కృషి చేసినప్పుడే అసలైన "నషాముక్తి తెలంగాణ" సాధ్యమవుతుంది. మన భవిష్యత్ తరాలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే, మన తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే, మత్తు రహిత సమాజ నిర్మాణం అత్యవసరం. "ఇది ఒక్కరి బాధ్యత కాదు —— సమాజం మొత్తానిదే. ప్రతి వ్యక్తి మత్తు పదార్థాలకు 'నో' అని చెప్పినప్పుడే మనం కోరుకున్న మార్పు ప్రారంభమవుతుంది." రండి... మనందరం కలిసి నషాముక్తి తెలంగాణ కోసం కంకణబద్ధులై ముందుకు సాగుదాం! చెయ్యి చెయ్యి కలుపుదాం... లక్ష్యసాధన కొరకు మన పిల్లల భవిష్యత్తుకై పోరాడుదాం!



వ్యాసకర్త
**నిమ్మల శ్రీనివాస్**
(సామాజికవేత్త)



# 'అమ్మవారిపేట'కు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే నాగరాజును కోరిన సమ్మక్క గుడి కమిటీ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతరకు అండగా నిలవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును గుడి కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం గుడి చైర్మన్ కోదూరు భిక్షపతి, జాతర ఆర్గనైజర్ దాసి రాందేవ్, జాతర ఉప కోశాధికారి బైరి హరినాథ్, కాంగ్రెస్ నాయకులు పోలం అనిల్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జాతర నిర్వహించనున్న నేపథ్యంలో జాతరలో అవసరమైన మరుగు దొడ్లు, స్నానాల ఘట్టాలు, నీటి కోసం కొత్త బోర్లు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. మూడు రోజుల పాటు భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ యంత్రాంగా, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి వైద్య శాఖ అధికారులు అందుభాటులో ఉండి సేవలు అందించాలన్నారు. భక్తుల తాగునీటి అవసరాల కోసం వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ముఖ్యంగా గత జాతరలో ఎమ్మెల్యే జాతరలో పాల్గొని సక్సెస్ చేశారని, అదే విధంగా ఈ జాతరలో కూడా ఎమ్మెల్యే తనవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. భక్తులకోసం గుంతల రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com